# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: కొత్తగ్రహం

## { రే బ్రాడ్‌బరీ కథకి స్వేచ్ఛానువాదం}

## (కథా కాలం 1949)

**చంద్రుడి** మీదికి మనిషిని పంపే తొలి ప్రయత్నంలో భాగంగా నాసా వారు ప్రయోగించిన రాకెట్ విజయవంతగా లాంచ్ అయింది.పావుగంట తర్వాత అంతరిక్ష కేంద్రంలో చిన్న కలవరం. వాళ్ళు రాకెట్‌నించి కమ్యూనికేషన్ కోల్పోయారు.

"దీనివల్ల వాళ్ళు వెళ్ళే దారి మారచ్చా?" డైరక్టర్ సైంటిస్ట్‌లని అడిగాడు.

"అదే మా అభిప్రాయం. మారచ్చు" వాళ్ళు చెప్పారు.

ఆయన కీటికీ దగ్గరికి వెళ్ళి చీకట్లో ఆకాశంలోని నక్షత్రాలవంక చూసాడు.

"మీరు ఎక్కడున్నా సరే. ఆ దేవుడే మీకు సహాయం చేయాలి" ఆ వ్యోమగాములని ఉద్దేశించి ప్రార్ధించాడు.

రాకెట్‌లోని కెప్టెన్ కల్నల్ డానర్ లాగ్‌బుక్‌లో రాసాడు.

'కమ్యూనికేషన్ తెగిపోయాక మా రాకెట్ ఏదో ఉల్క లాంటిదానిమీద క్రాష్ లేండ్ అయింది. ఎందుకు పాడైందో తెలీదు కానీ రాకెట్‌లోని ఎలక్ట్రిక్ సిస్టం పాడై పేలిపోయింది. కోరీ, పియర్సన్ క్షేమంగా ఉన్నారు. నేవిగేటర్ యుడాక్ సీరియస్‌గా గాయపడ్డాడు. నేను కూడా. మిగిలినవారంతా మరణించారు. ఆహారపదార్ధాలు, నీరు నాశనమైపోయాయి. మేము ఎక్కడున్నామో తెలియడంలేదు.'

కోరీ కోపంగా కెప్టెన్ దగ్గరికి వచ్చి లాగ్‌బుక్‌ని లాక్కుని కోపంగా చెప్పాడు.

"నీ జ్ఞాపకాలు రాసే సమయం కాదిది."

"కోరీ. మనం వ్యోమగాములమని మర్చిపోకు. ఇది మన బాధ్యత. మనం వ్యోమగాములుగా ఉన్నంతకాలం ప్రవర్తన నియమాలని, ప్రోటోకాల్‌ని పాటించి తీరాలి."

"కల్నల్ డానర్! ఇక్కడ చాలా వేడిగా ఉంది. భరించలేనంత. నీ శక్తినంతా ఇది రాయడానికి ఉపయోగించే బదులు, ఇక్కడనించి ఎలా బయటపడాలో చూడొచ్చు కదా?"

"కోరీ. నువ్వు కల్నల్‌వి కాదు" పియర్సన్ హెచ్చరించాడు.

చుట్టూ ఉన్న కొండలు, ఇసుకలని చూస్తూన్న కోరీ గాయపడ్డ యూడాక్ దగ్గరికి డానర్ వెళ్ళడం, అతనికి మంచినీళ్ళు తాగించడం గమనించి అడిగాడు.

"మన దగ్గర ఎంత నీరుంది?"

"ఇది ఐదు గాలన్ల కేన్."

"ఐతే ఎందుకు వృథా చేస్తున్నారు?"

వాళ్ళిద్దరూ అతనివంక ఆశ్చర్యంగా చూసారు.

"ఇతను మధ్యాహ్నందాకా కూడా జీవించకపోవచ్చు."

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" డానరడిగాడు.

"ఐదు గాలన్లలో నా వంతు కూడా ఉంది. జీవించే అవకాశం ఉన్నవారికే ఆ నీరు చెందాలి."

"కోరీ, నువ్వు ఇతని స్థానంలో ఇక్కడ పడివుంటే ఆ మాట చెప్పేవాడివా? నీకు నీరు అక్కర్లేదని మమ్మల్ని తాగమనేవాడివా?" డానర్ ప్రశ్నించాడు.

కానీ కల్నల్! ఇతను రూఢీగా మరణిస్తాడు. మాటలతో మభ్యపెట్టకండి" కోరీ అరిచాడు.

"మరణిస్తే మరణిస్తాడు. అతనికి దాహం వేస్తే నీరిస్తాం. నీడ కావాలంటే నీడ ఇస్తాం. మరణించాక ప్రార్థన కూడా చేస్తాం. పియర్సన్ మీరు మరణించినవారికి సమాధులని తవ్వండి" డానర్ కోరాడు.

వాళ్ళు ఆ అవశేషాల్లోంచి చిన్న పారలని తీసుకున్నారు. కోరీ డానర్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"కల్నల్! సూర్యుడు తీవ్రంగా ఉన్నాడు. మన రాకెట్ కూలిన గ్రహశకలం భూమి కక్ష్యలోనే తిరుగుతుందని సూర్యుణ్ణి బట్టి తెలుస్తుంది."

"అవును. ఈ రాకెట్ ని నిర్మించడానికి నాలుగున్నరేళ్ళు పట్టింది. అందుకు వెయ్యి సంవత్సరాల గణిత శాస్త్రం ఉపయోగపడింది. కానీ ఈ గ్రహశకలం ఏమిటో, దీనిమీద మనం ఎక్కడున్నామో, మనల్ని పంపినవారికి తెలియదు. ఇక్కడినించి తప్పించుకోవాలంటే మనమే ఇంకో రాకెట్‌ని నిర్మించుకుని వెళ్ళాలి" డానర్ నిస్పృహగా చెప్పాడు.

సాయంత్రానికల్లా శవాలని పూడ్చేసారు. యూడాక్ పరిస్థితి అలాగే ఉంది.

"ఇది గ్రహశకలం కాదు. ఏదో గ్రహం. గ్రహశకలంలో కొండలు, ఎడారులు ఉండవు. రాత్రయ్యేసరికి బాగా చల్లబడుతుంది. మనం ఏ కొండ గుహనో వెదుక్కోవడం మంచిది" కోరీ సూచించాడు.

కల్నల్ మళ్ళీ యూడాక్‌కి మంచినీళ్ళు తాగించడం చూసిన కోరీ ఆయన దగ్గరికి వెళ్ళి అరిచాడు.

"వద్దు. తాగించకండి. ఇవి నా నీళ్ళు. ఇందులో నా వంతు కూడా ఉంది."

కల్నల్ చేతిలోని నీటి కేన్‌ని బలవంతంగా లాక్కున్నాడు. వెంటనే కల్నల్ వెళ్తున్న అతని కాలుకి తన కేన్ అడ్డుపెట్టి కింద పడేసాడు. ఇద్దరూ ఆ నీటి కేన్‌ని స్వాధీనం చేసుకోడానికి పెనుగులాడసాగారు.

"కల్నల్" పియర్సన్ అరిచాడు. ఇద్దరూ అతని వంక చూసారు.

"నీకో సంతోషకరమైన వార్త కోరీ. నీ నీళ్ళు తాగేందుకు ఇక ఇతను జీవించిలేడు.

కలన్ల్ వెళ్ళి యూడాక్‌ని పరిశీలించి మళ్ళీ పారని అందుకున్నాక కోరీ యూడాక్ భుజాన వేలాడే నీళ్ళ కేన్‌ని అందుకున్నాడు.

"కోరీ! అది అందరి నీరు. దాన్ని మనం ముగ్గురం సమానంగా పంచుకోవాలి. ఇంకోసారి నువ్వు నీళ్ళు దొంగతనం చేస్తే నిన్ను చంపేస్తాను" పియర్సన్ కోపంగా అరిచాడు.

"నీ విషయంలో కూడా ఇదే జరుగుతుందని గుర్తుంచుకో" కోరీ జవాబు చెప్పాడు.

"గాయాలతో నేను నడిచే స్థితిలో లేను. ఇక్కడ పనయ్యాక మీరిద్దరూ చెరో వైపుకి వెళ్ళి మనం జీవించి ఉండేందుకు అవసరమైనవి దొరుకుతాయేమో చూసి, చీకటి పడేలోగా ఇక్కడకి రండి. ఇది ప్రస్తుతం మన ఇల్లు" కల్నల్ చెప్పాడు.

ఆ ప్రకారం కోరీ, పియర్సన్ ఆహారాన్ని అన్వేషిస్తూ బయలుదేరారు.

చలిమంట వేసుకున్న కల్నల్ మిగిలిన ఇద్దరి కోసం ఎదురుచూడసాగాడు. అర్ధరాత్రి దాటింది. కానీ ఎవరూ తిరిగి రాలేదు. మాగన్నుగా నిద్రపోతూ మధ్య మధ్యలో 'కోరీ, పియర్సన్' అని అరుస్తున్నాడు  కొద్దిసేపటికి అలికిడి విని లేచాడు. నీరసంగా వచ్చి చలిమంట దగ్గర కూలబడ్డ కోరీ నీళ్ళు తాగాడు.

"ఏమైంది?" కల్నల్ ప్రశ్నించాడు.

"నేను దాదాపు పదహారు మైళ్ళు తిరిగాను. ఎక్కడ చూసినా రాళ్ళు, గుట్టలు తప్ప ఇంకేం కనపడలేదు. ఎక్కడా ఆహారం లేదు. ఈ గ్రహం మీద చెట్లు ,మొక్కలు లేవు."

"పియర్సన్ సంగతి ఏమిటి?"

"నేను పశ్చిమం వైపు, అతను దక్షిణం వైపు వెళ్ళాం. రాలేదా?"

కోరీ తాగుతున్న నీటి కేన్‌ని చేతిలోకి తీసుకుని చూసి కల్నల్ అడిగాడు.

"నువ్వు 16 మైళ్ళ నడకలో పావువంతు నీరు మాత్రమే తాగావా? నేనిక్కడ కదలకుండా కూర్చునే ముప్పాతిక పైనే తాగాను. నీ దాహం ఏమైంది? పియర్సన్ నీటిని తాగాక అతని శవాన్ని ఎక్కడ పడేసావు చెప్పు?"

"కల్నల్! పియర్సన్ కొండ ఎక్కుతూ కిందపడి, రాతికి తల కొట్టుకుని మరణించాడు."

"ఇది ఎక్కడ జరిగింది?"

"కొండపాదం దగ్గర. తిరిగి వచ్చేప్పుడు.'

"నువ్వు చంపావు."

"లేదు. ఒట్టు పెడుతున్నాను. నేనతన్ని ముట్టుకోలేదు. అతని శవం కనపడ్డాక, అతని నీటి కేన్‌ని తీసుకుని తాగాను."

"మనం వెళ్ళి అతన్ని పాతిపెడదాం. నువ్వు చెప్పింది నిజమో కాదోకూడా చూద్దాం.

"మీకు పిచ్చెక్కిందా? ఇక్కడ నించి ఆరేడుమైళ్ళు దూరం వెళ్ళాలి. నేనిక నడవలేను."

"నువ్వింక మరణించలేదు పద."

కల్నల్ అతని రివాల్వర్‌ని తీసుకుని, తన రైఫిల్‌ని గురిపెట్టి చెప్పాడు.

"ఇది ఆజ్ఞ. పద."

కోరీ ముందుకి నడుస్తుంటే వెనకాల కల్నల్ అతన్ని అనుసరించాడు రాత్రంతా.

సూర్యోదయం అయింది. ఓ చోట కూలబడ్డ కోరీ చెప్పాడు.

"ఇక నేను నడవలేను."

"పద" కల్నల్ ఆజ్ఞాపించాడు.

వారు మరికొంత దూరం వెళ్ళాక కోరీ ఓ చోట చూపించి చెప్పాడు.

"ఇక్కడే అది జరిగింది."

కానీ పియర్సన్ శవం అక్కడ లేదు.

"అవిగో అడుగుజాడలు. అటువైపు వెళ్ళినట్లున్నాడు" కల్నల్ చెప్పాడు.

"నేను పొరబడి ఉంటాను. మరణించాడనుకున్నాను" కోరీ చెప్పాడు.

"కోరీ. అతను జీవించి ఉన్నాడో లేదో పరిశీలించవా? అతనికి సహాయం చేసే ప్రయత్నం ఏమైనా చేసావా అసలు? అతని నీళ్ళు దొంగిలించి వచ్చావు. అవునా?""

"నాకు బాగా  దాహం వేసింది. నాలిక పిడచకట్టుకుపోయింది."

"పియర్సన్, పియర్సన్. నేను కల్నల్ డానర్‌ని. జవాబు చెప్పు."

గట్టిగా అరుస్తూ కల్నల్ అడుగుజాడల వెంట ముందుకి సాగాడు. కొద్దిదూరంలో పడున్న పియర్సన్ దగ్గరకెళ్ళి చూసాడు. అతను. రక్తం కారి మరణించాడు. కల్నల్ చేతిలోని తుపాకీని పక్కనపెట్టి దైవప్రార్ధన చేస్తుండగా కోరీ అదే అదనుగా తుపాకీ తీసుకున్నాడు. కళ్ళు తెరిచిన కల్నల్ అడిగాడు.

"కోరీ, నువ్వే రాతితో తలమీద మోది పియర్సన్‌ని చంపావు కదా?"

"కల్నల్, ఇప్పుడు మిగిలిన నీళ్ళతో ఇద్దరు ఐదు రోజులు జీవించగలరు. ఒక్కరైతే పదిరోజులు."

తన వైపు రైఫిల్‌ని గురిపెట్టిన కోరీ వంక చూస్తూ కల్నల్ చెప్పాడు.

"కోరీ. నీకు పిచ్చా? ఇప్పటికే ఒకర్ని చంపావు. మళ్ళీ రెండో హత్యకూడా చేస్తావా?"

కోరీ చేతిలోని తుపాకీ పేలింది. కిందపడి రాళ్ళమీంచి దొర్లిన కల్నల్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు.

"కల్నల్. నువ్వు చేసిన పొరపాటు ఈ దెయ్యాల దిబ్బ మీదకి మిలటరీ ప్రవర్తనావళిని తీసుకురావటం, ఇక్కడ బలవంతుడిదే రాజ్యం..."

వెళ్ళి అతని భుజాన ఉన్న వాటర్ కేన్ అందుకుని చూస్తే ఖాళీ, తుపాకీ గుండు చేసిన రంధ్రంలోంచి నీళ్ళన్నీ కారిపోయాయి.

"నువ్వు తప్పుచోట నైతికతని కోరావు" చెప్పి కోరీ వంక చూస్తూ కల్నల్ చెప్పాడు.

"కోరీ చేతిలోని తుపాకీ పేలింది. కిందపడి రాళ్ళమీంచి దొర్లిన కల్నల్ దగ్గరికి వెళ్తూ చెప్పాడు.

"కల్నల్, నువ్వు చేసిన పొరపాటు ఈ దెయ్యాల దిబ్బ మీదికి మిలటరీ ప్రవర్తనావళిని తీసుకురావటం. ఇక్కడ బలవంతుడిదే రాజ్యం.."

వెళ్ళి అతని భుజాన ఉన్న వాటర్ కేన్ అందుకుని చూస్తే ఖాళీ. తుపాకీ గుండు చేసిన రంధ్రంలోంచి నీళ్ళన్నీ కారిపోయాయి.

"నువ్వు తప్పుచోట నైతికతని కోరావు" చెప్పి కోరీ చదరపు ప్రదేశంలో నడవసాగాడు.

కొద్దిదూరం వెళ్ళాక ఓ కొండ పాదానికి చేరుకుని దాన్ని ఎక్కసాగాడు. సగం దూరం ఎక్కాక వెనక్కి తిరిగి చూస్తే కింద వారి శవాలు కనిపించాయి. ఎండలో రాళ్ళమీద అతి కష్టపడుతూ కోరీ మొత్తానికి కొండ శిఖరం అంచుకి చేరాడు. ఆఖరి చుక్క నీరు కూడా అయిపోయింది. అన్నిటికన్నా ఎత్తయిన కొండ శిఖరాన్ని అధిరోహించి అవతలివైపు చూసాడు వెంటనే అతను పకపకా నవ్వుతూ గట్టిగా అరిచాడు.

"కల్నల్! పియర్సన్! ఏం కనబడుతోందో చూడండి."

అతను చూసేవైపు ఎదురుగా టెలిఫోన్ స్తంభాలు, రెనో 27 మైళ్ళు. నెవాడా అన్న మైలురాయి ఉన్నాయి.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments